క్లుప్తంగా

అయ్యప్ప స్వామికి పూజలు



అయ్యప్ప స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

గుర్ల: అయ్యప్ప స్వామి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని రామాలయం వద్ద గురుస్వాములు సత్యం, రాము సమక్షంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప స్వామికి అభిషేకాలు జరిపారు. సుమారుగా 3వేల మందికి అన్నసంతర్పణ చేశారు.

పార్టీ బలోపేతానికి కృషి



పాట్నూరు సన్యాసినాయుడు

గుర్ల: మండలంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని పార్టీ మండలాధ్యక్షుడు పాట్నూరు సన్యాసినాయుడు తెలిపారు. శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తనపై నమ్మకం ఉంచి పార్టీ మండలాధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న నాయకులందరితో కలిసి పార్టీని మరింత బలోపేతం చేస్తానని చెప్పారు.

శ్మశానవాటికలో బోరు నిర్మాణం



శ్మశానవాటికలో బోరు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ విజయలక్ష్మి, గ్రామ పెద్దలు

చీపురుపల్లిరూరల్(గరివిడి): శ్మశానవాటికలో బోరు నిర్మాణానికి మండల పరిషత్ నుంచి రూ. 1.20 లక్షల నిధులు మంజూరు చేసినట్టు ఎంపీపీ మీసాల విజయలక్ష్మి తెలిపారు. గరివిడి మండలం రేగటి పంచాయతీ పరిధిలోని నీలాద్రిపురం శ్మశాన వాటికలో హ్యాండ్ బోర్ నిర్మాణానికి ఆమె శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కడుమల రాంబాబు, మాజీ సర్పంచ్ అలమండ అప్పలనాయుడు, గ్రామ పెద్దలు మజ్జి రాజినాయుడు, తవిటినాయుడు, అగురు శ్రీరాములు, స్వామినాయుడు పాల్గొన్నారు.

కూరగాయల సాగుపై రైతుల ఆసక్తి



శ్రీరంగరాజపురంలో రైతులు సాగు చేస్తున్న వంగ తోట

గజపతినగరం: కూరగాయల సాగుపై రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. ఖరీఫ్ వరి సాగుకు ప్రభుత్వం పెట్టుబడి సాయం అందివ్వకపోవడంతో పాటు పెట్టుబడి కూడా భారీగా అవుతుండడంతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు, ఆదాయం వచ్చే మార్గాలను అన్నదాతలు అన్వేషిస్తున్నారు. దీనిలో భాగంగానే కూరగాయల సాగును ఆశ్రయిస్తున్నారు. చేతికి వచ్చిన పంటను మార్కెట్‌లో విక్రయించి అనుకున్న లాభం పొందుతున్నారు. మండలంలోని మరుపల్లి, మదుపాడ, కాలంరాజుపేట, శ్రీరంగరాజపురం, ఎం.గుమడాం తదితర గ్రామాల్లో వంగ, బెండ, మిరప, దొండ, చిక్కుడు, ఆనప, క్యాబేజి తదితర కూరగాయ పంటలను రైతులు సాగు చేస్తున్నారు.

మానసాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలందుకున్న మానసాదేవి నాగశక్తి అమ్మవారు

చీపురుపల్లి: మండలంలోని రామలింగాపురం -పుర్రేయవలస గ్రామాల మధ్యన ఉన్న మానసాదేవి నాగశక్తి అమ్మవారి ఆలయంలో భక్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పిన్నింటి రమణ తెల్లవారుఝామున 3 గంటల నుంచి అమ్మవారిని అలంకరించి ఉదయం 5 గంటలకు భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

తూతూమంత్రంగా.. పొలం పిలుస్తోంది!

- కార్యక్రమ నిర్వహణపై ప్రభుత్వం నిర్లక్ష్యం
- మొక్కుబడిగా కొనసాగిస్తూ కాలయాపన
- రైతులకు ఏమాత్రం ఉపయోగపడని వైనం
- కేవలం వ్యవసాయాధికారులే హాజరుపై విమర్శలు



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

బొండపల్లి: వ్యవసాయాన్ని లాభసాటిగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా ఆరంభించిన పొలం పిలుస్తోంది కార్యక్రమం ఇప్పుడు తూతూమంత్రంగా కొనసాగుతోంది. వ్యవసాయం దాని అనుబంధ రంగాలకు సంబంధించి, మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించి, వారిని వ్యవసాయ శాస్త్రవేత్తలుగా మలచడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యం. కాగా ఇప్పుడు ఆ కార్యక్రమం రైతులకు ఏమాత్రం ఉపయోగపడడం లేదు. వారంలో రెండు రోజుల పాటు ఆ కార్యక్రమంలో భాగంగా క్షేత్ర స్థాయిలో పంటలను అధికారులు పరిశీలించి, సాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, పంటలకు పట్టే చీడపీడలు, వ్యాధులు తెలుసుకుని తగిన సలహాలు, సూచనలు చేయాల్సి ఉంది. అలాగే నూతన వ్యవసాయ విధానాలు, వ్యవసాయంలో యాంత్రీకరణ ద్వారా కలిగే లాభాలు, మార్కెట్‌లో ఏయే పంటలకు ఏ మేర డిమాండ్ ఉందన్న విషయాలను తెలియపరచాలి. ఇదంతా వ్యవసాయ శాఖ అధికారులతో పాటు పశు సంవర్ధక శాఖ, ఉద్యానవన శాఖల అధికారులు చేయాలి. అయితే కేవలం వ్యవసాయ సిబ్బంది, అధికారులు మాత్రమే పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొంటున్నారు.

అధికారులు హాజరు తప్పనిసరి..



పొలం పిలుస్తోంది కార్యక్రమానికి వ్యవసాయ అధికారులే కాదు.. పశు సంవర్ధక, ఉద్యానవన, మత్స్యశాఖ అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలి. వారంతా కార్యక్రమానికి వస్తేనే రైతులందరికీ ఆయా రంగాల్లో లాభసాటి సాగు విధానాలపై అవగాహన పెంపొందించడం జరుగుతుంది.

– కె.మహారాజన్, గజపతినగరం సబ్‌డివిజన్ ఏడీప

గతంలో పొలంబడి..

గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇదే కార్యక్రమాన్ని పొలంబడి పేరిట గ్రామగ్రామాన నిర్వహించి, రైతులకు విలువైన సాగు సలహాలు, సూచనలు అందిస్తూనే కొత్త వ్యవసాయ పద్ధతులు, ఏయే నేలల్లో ఏ రకమైన పంటలు వేస్తే అధిక దిగుబడులు వస్తాయన్న అంశాలను క్షుణ్ణంగా తెలిపేవారు. ఇప్పుడు ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని పొలం పిలుస్తోందిగా పేరు మార్చిందే తప్ప కార్యక్రమ లక్ష్యాలు నెరవేరేలా ఏ కార్యాచరణ పూర్తిగా చేయడం లేదన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ప్రతి మంగళ, బుధవారాల్లో ఎంపిక చేసిన గ్రామాల్లో రబీ, ఖరీఫ్ సీజన్ సాగుకు సంబంధించి, రైతులకు అవగాహన కల్పించాలి. ఆ దిశగా ఆశించిన స్థాయిలో కార్యక్రమ నిర్వహణ లేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.

ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలి..



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలి. ఒక్క వ్యవసాయ అధికారులే వస్తే లాభమేముంది. అన్ని శాఖల అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు కూడా కార్యక్రమంలో పాల్గొంటేనే రైతులకు ప్రయోజనం ఉంటుంది.

– మహంతి రమణ, గొట్లాం పీఏసీఎస్ మాజీ చైర్మన్

ప్రభుత్వ ఆస్తులు కాపాడాల్సిన బాధ్యత మీపై లేదా?

- మండల సర్వసభ్య సమావేశంలో అధికారుల తీరుపై సభ్యుల ధ్వజం



అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీపీ చలంనాయుడు



అధికారుల తీరుపై నిలదీస్తున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు

బొండపల్లి: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత మీపై లేదా అని ఈవోపీఆర్‌డీ రఘుపతిరావుపై ఎంపీటీసీ సభ్యులు, పలువురు సర్పంచ్‌లు ధ్వజమెత్తారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చల్లా చలంనాయుడు అధ్యక్షతన శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పలువురి అధికారుల నిర్లక్ష్య వైఖరిని సభ్యులు ఎండగట్టారు. వెదురువాడ గ్రామ పంచాయతీ చెరువు గట్టుపై మునగచెట్ల నుంచి మునగకాడలను అధికార పార్టీకి చెందిన ఓ వ్యక్తి ఇష్టారాజ్యంగా కోసేసి, పంచాయతీ ఆదాయానికి గండికొట్టారని, ఇదే విషయంపై పంచాయతీ కార్యదర్శి వి.సింహాచలంకు ఫిర్యాదు చేసి 15 రోజులు గడిచినా ఇంతవరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని సర్పంచ్ కిలా పైడిరాజు, ఎంపీటీసీ సభ్యులు మోపాడ సత్యవతిలు నిలదీశారు. ఎంపీడీవో గిరిబాల స్పందించి, సంబంధిత కార్యదర్శికి మెమో జారీ చేస్తామన్నారు. ఈ ఏడాది రబీ సీజన్‌లో వేసిన అపరాల పంటలకు సంబంధించి, రైతులు పంటల బీమా ప్రీమియం చెల్లించినా నష్టపోయిన పంటలకు గాను ఒక్క రైతుకు కూడా బీమా పరిహారం అందివ్వలేదన్న విషయాన్ని ఎం.కొత్తవలస, బి.రాజేరు గ్రామాల సర్పంచ్‌లు కర్రోతు శ్రీనివాసరావు, ఈదుబిల్లి కృష్ణలు ఏవో మల్లికార్జునరావు దృష్టికి తీసుకువెళ్లారు. పంటకోత ప్రయోగాలు చేశామని, ఆ ప్రకారమే బీమా వర్తిస్తుందని ఏవో సమాధానమిచ్చారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దిన ప్రభుత్వ పాఠశాలలను ఎత్తివేయాలని ప్రయత్నిస్తుండడం దుర్మార్గమని ఎంఈవో-2 అల్లు వెంకటరమణను ఉద్దేశించి, సర్పంచ్ కృష్ణ అన్నారు. ఏ ఒక్క అధికారి ప్రోటోకాల్ పాటించడం లేదని, గ్రామాల్లో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలకు సర్పంచ్‌లు, ఎంపీటీసీలను ఆహ్వానించడం లేదని వైస్ ఎంపీపీ గొండేల ఈశ్వరరావు, సర్పంచ్‌లు కర్రోతు శ్రీనివాసరావు, కృష్ణ, బుంగదేవుడు, అంబటివలస ఎంపిటీసీ తాళ్లపూడి అప్పలనాయుడు ఆరోపించారు. ఎంపీపీ జోక్యం చేసుకుని, అధికారులు తప్పనిసరిగా ప్రోటోకాల్ పాటించాలని, లేకపోతే కోర్టులను ఆశ్రయించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ విషయంలో తీర్మానం చేసి ఉన్నతాధికారులకు పంపించాలని ఎంపీడీవోను ఆదేశించారు. సమావేశంలో తహసీల్దారు డోలా రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో క్షీరాభిషేకం



స్వామి వారి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి

వేపాడ: మండలంలోని కుమ్మపల్లి గ్రామంలో శ్రీగణపతి, శ్రీకృష్ణా సహిత శ్రీసీతారాముల ఆలయ పునఃప్రతిష్ఠ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పాల్గొని, స్వామి వారి ప్రతిమలకు భక్తిశ్రద్ధలతో క్షీరాభిషేకం చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యవంతుడు, సర్పంచ్ అరుణ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

16న మెగా వైద్యశిబిరం

దత్తిరాజేరు: మండలంలోని పోరలి గ్రామంలో ఈ నెల 16వ తేదీన సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు వైవీ సాయికుమార్ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆస్పత్రి వైద్యులు ఈ శిబిరానికి వచ్చి, రోగులకు ఆరోగ్య తనిఖీలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేయడం జరుగుతుందని, శస్త్రచికిత్స చేయాల్సి వస్తే అది కూడా ఉచితంగానే చేయడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 7702358809ను సంప్రదించాలని కోరారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

గజపతినగరం: మండలంలోని ఎం.వెంకటాపురం, పురిటిపెంట, గజపతినగరం, గంగచోళ్లపెంట, కొనిశ, మెంటాడ, మద్రివలస, పత్రువాడ, కొత్తబగ్గాం, పాతబగ్గాం, బంగారమ్మపేట, భూదేవిపేట గ్రామాలకు ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు బొబ్బిలి డివిజన్ కార్యనిర్వాహక ఇంజినీర్ ఎ.అనంతరావు ఓ ప్రకటనలో శుక్రవారం వెల్లడించారు. మండల కేంద్రంలోని 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనుల నేపథ్యంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ప్రతి గ్రామాన బీజేపీ జెండా ఎగరాలి

శృంగవరపుకోట: ప్రతి గ్రామాన బీజేపీ జెండా ఎగరాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేష్‌వర్మ అన్నారు. స్థానిక బీజేపీ నాయకుడు చిరంజీవి యాదవ్ కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు మరిశా శ్రీను నేతృత్వంలో పలువురు బీజేపీలో శుక్రవారం చేరారు. వారందరికీ రాజేష్ వర్మ చేతులమీదుగా ఆ పార్టీ కండువాలు వేయించి, సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలని వారిని కోరారు.

పార్టీ మండలాధ్యక్షునికి సత్కారం



మీసాల వరహాలనాయుడును సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ చీపురుపల్లి మండలాధ్యక్షునిగా మీసాల వరహాలనాయుడు నియామకమయ్యారు. ఆయనను లావేరురోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతం, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు కలిసికట్టుగా పనిచేద్దామన్నారు. కార్యక్రమంలో యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ దన్నాన జనార్దనరావు, పతివాడ రాజారావు, రేవల్ల సత్తిబాబు, గవిడి సురేష్, అడ్డూరి కృష్ణ, రొంతు పైడిరాజు, కంచుపల్లి అశోక్, కందుల కృష్ణ, కర్రోతు ప్రసాద్, రొబ్బి చిన్ని, పతివాడ అఖిల్, ప్రభాత్ తదితరులు పాల్గొన్నారు.

హోలీ సందడి



కస్పావీధిలో రంగులు జల్లుకుంటూ సందడి చేస్తున్న చిన్నారులు

చీపురుపల్లిలో హోలీ పండగను చిన్నారులు, పెద్దలు శుక్రవారం సందడిగా జరుపుకున్నారు. ఒకరిపై ఒకరు రంగులు జల్లుకుని హోలీ శుభాకాంక్షలు తెలిపారు. రంగుల్లో చిన్నారులు మురిసిపోయారు. వీధుల్లో కేరింతలు కొట్టారు.

– చీపురుపల్లి



శృంగవరపుకోట: ఎస్.కోటలో మార్వాడీల హోలీ సంబరాలు

గదబవలసలో ఆర్డీవో పర్యటన



గదబవలస గ్రామంలో పర్యటిస్తున్న ఆర్డీవో కీర్తి

వేపాడ: మండలంలోని గదబవలస గిరిజన గ్రామంలో విజయనగరం ఆర్డీవో దాట్ల కీర్తి శుక్రవారం సాయంత్రం పర్యటించారు. అక్కడి గిరిజనుల భూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నో ఏళ్లుగా తాము సాగు చేస్తున్న ఇనాం, ప్రభుత్వ భూములకు సంబంధించి, ఎటువంటి పట్టాలు అందివ్వకపోవడంతో ప్రభుత్వ పథకాలు, ప్రోత్సాహకాలు, రాయితీలు పొందలేకపోతున్నామని గిరిజనులు వాపోయారు. ఆయా భూములకు సంబంధించి, సర్వే చేసి నివేదిక సమర్పించాలని తహసీల్దారు రాములమ్మను ఆర్డీవో ఆదేశించారు. ఆమె వెంట డిప్యూటీ తహసీల్దారు సన్యాసినాయుడు, వీఆర్వో, సర్వేయరు తదితరులు ఉన్నారు.



ఫ్రిజ్‌ను అందజేస్తున్న ముల్లు రమణ, రమాదేవి దంపతులు

ఫ్రిజ్ వితరణ

చీపురుపల్లి: పేదంటి ఆడపిల్లల వివాహాలకు ట్రస్టు తరఫున వివిధ రూపాల్లో సహాయం అందజేస్తున్నట్టు దుర్గామల్లేశ్వర సేవా ట్రస్టు వ్యవస్థాపకులు ముల్లు రమణ, రమాదేవి దంపతులు తెలిపారు. పట్టణంలోని మెట్టకాలనీకి చెందిన రాజేశ్వరి వివాహ సందర్భంగా రూ.23 వేలు విలువైన ఫ్రిజ్‌ను శుక్రవారం బహుమతిగా అందజేశారు.

కొత్త బాధ్యతలు

- వైఎస్సార్‌సీపీ గరివిడి మండలాధ్యక్షుడిగా విశ్వేశ్వరరావు



మీసాల విశ్వేశ్వరరావు

చీపురుపల్లిరూరల్(గరివిడి): వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ గరివిడి మండలాధ్యక్షుడిగా కె.పాలవలస పంచాయతీకి చెందిన సీనియర్ నాయకుడు మీసాల విశ్వేశ్వరరావును పార్టీ అధిష్టానం నియమించింది. ఆయన 1995 నుంచి 2021 వరకు పాలవలస పంచాయతీ సర్పంచ్‌గా పనిచేశారు. రెండు పర్యాయాలు చీపురుపల్లి ఏఎంసీ చైర్మన్‌గా, గతంలో పార్టీ మండలాధ్యక్షుడిగా సేవలందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు. వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా పార్టీ పటిష్టతకు కృషిచేస్తానన్నారు.

ఇన్‌స్పైర్ పోటీలకు చినబంటుపల్లి విద్యార్థులు



ధనలక్ష్మి, రూన్సీలక్ష్మి

మెరకముడిదాం: భారతీయ విజ్ఞాన సాంకేతిక మండలి ఏటా నిర్వహించే ఇన్‌స్పైర్ కాంపిటీషన్స్ 2024–25కు చినబంటుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు లోచర్ల ధనలక్ష్మి, దాసరి రూన్సీ ఎంపికయ్యారు. ప్రాజెక్టుల రూపకల్పనకు ఒక్కో విద్యార్థికి రూ.10వేలు చొప్పున మంజూరైనట్టు హెచ్ఎం ఆల్తిరాంబాబు తెలిపారు. విద్యార్థులతో పాటు గైడ్‌గా వ్యవహరించిన ఉపాధ్యాయులను హెచ్ఎం అభినందించారు.

పదో తరగతి విద్యార్థులకు ఉచిత బస్సు

శృంగవరపుకోట: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు ఎస్.కోట ఆర్టీసీ బస్ డిపో మేనేజర్ కె.రమేష్ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పరీక్షలకు వెళ్లే వారంతా తమ హాల్ టికెట్ చూపించి, బస్సు టికెట్ తీయకుండా ప్రయాణం చేయవచ్చన్నారు. పరీక్షలు ముగిసేంత వరకు ఈ సదుపాయం అందుబాటులో ఉంటుందన్నారు.

వేపాడ: మండలంలోని జాకేరు, కరకవలస, చామాలాపల్లి మీదుగా వేపాడలో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం ప్రత్యేకంగా బస్సు నడిపేందుకు ఎస్.కోట ఆర్టీసీ డిపో మేనేజర్ రమేష్ బృందం ఆయా గ్రామాల్లో శుక్రవారం సర్వే నిర్వహించారు.

నేడు 'స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర' ర్యాలీ

దత్తిరాజేరు: మండల కేంద్రంలో స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం శనివారం చేపట్టి, ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ప్రతినెలా మూడో శనివారం చేపట్టే ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించనున్నామన్నారు.

మూడు కేంద్రాల్లో 'పది' పరీక్షలు

దత్తిరాజేరు: మండలంలోని మూడు కేంద్రాల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగుతాయని ఎంఈవో ఎం.వెంకటరావు ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభంకానున్న పరీక్షలకు మరడాం కేంద్రానికి 200 మంది, దత్తిరాజేరు కేంద్రానికి 146 మంది, పెదమానాపురం కేంద్రానికి 110 మంది వచ్చి, పరీక్షలు రాయనున్నారన్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరీక్ష కేంద్రాలను సిద్ధం చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

తల్లిదండ్రులకు పాదపూజ



తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న పిల్లలు

శృంగవరపుకోట: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో మహా అవతార్ బాబాజీ ధ్యానమందిరం గురువులు శ్రీరామ్‌బాబాజీ, లక్ష్మి మాతాజీల నేతృత్వంలో పలువురు తమ తల్లిదండ్రులకు పాదపూజ శుక్రవారం చేశారు. అనంతరం ఆయా గురువులు మాట్లాడుతూ మాతా పితలను మించిన దైవం లేదని, తల్లిదండ్రులే ప్రత్యక్షంగా కనిపించే దైవాలన్నారు. తల్లిదండ్రుల ఆశీర్వాదం పిల్లలకు అవసరమని, వారి ఆశీస్సులు ఉంటే ఆయుష్షు, ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం, విజయం సిద్ధిస్తాయన్నారు. ప్రతిఒక్కరూ తమ తల్లిదండ్రులను గౌరవించాలని కోరారు. కార్యక్రమంలోవాసవీ వనితా క్లబ్ మహిళలు తదితరులు పాల్గొన్నారు.